క్లుప్తంగా

విఘ్నేశ్వర స్వామికి బంగారు కిరీటం



కాకినాడ సాలిపేట విఘ్నేశ్వరునికి అలంకరించిన బంగారు కిరీటం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడ మెయిన్‌రోడ్డులోని సాలిపేట వద్ద ఉన్న విఘ్నేశ్వరస్వామికి నగరానికి చెందిన పలువురు రూ. 8.30 లక్షలతో తయారు చేయించిన బంగారం వెండి కిరీటాన్ని గురువారం అలంకరించారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా వీటిని అందజేశారు. తొలుత అర్చకులు బంగారం కిరీటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అలంకరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ బెండా విష్ణుమూర్తి, ఆలయ ఈఓ శివబాబు, ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి పార్వతి, ఆలయ కమిటీ సభ్యులు జువ్వల పార్వతి, కె.జ్యోతి, బి.అనిల్‌కుమార్, ఎస్ శ్రీనివాస్, కె మధుబాబు పాల్గొన్నారు.

14న అయ్యప్పస్వామి ఆలయంలో జ్యోతి దర్శనం

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో ఈనెల 14న జ్యోతి దర్శనం ఉంటుందని ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ గురువారం తెలిపారు. సంక్రాంతి సందర్భంగా ఉదయం నుంచి స్వామికి విశేష పూజలు , అభిషేకాలు, నవకలశపూజ, హోమాలు, సాయంత్రం ఐదు గంటలకు స్వామి వారికి స్వర్ణ ఆభరణమాల సమర్పణ, అమ్మవారికి సువర్ణ వస్త్రాలంకరణ, జ్యోతి దర్శనం ఉంటుందన్నారు. అనంతరం దీపోత్సవం, వాహన సేవ, పుష్పాభిషేకం, పవళింపు సేవ జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

పరుగుపందెంలో ఐటీఐ విద్యార్థికి ద్వితీయ స్థానం



మారథాన్ రన్‌లో ద్వితీయస్థానం సాధించిన సురేష్‌తో ఐటీఐ ప్రిన్సిపాల్ వర్మ

నాగమల్లితోట జంక్షన్: ఇటీవల కాకినాడ సీపోర్ట్సు ఆధ్వర్యంలో కాకినాడ బీచ్ వద్ద నిర్వహించిన మారథాన్‌లో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థి ఏపీ సురేష్ 42 కిలోమీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడని ప్రిన్సిపాల్ వర్మ గురువారం తెలిపారు. సురేష్ ఫిట్టర్ ట్రేడ్‌లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని సురేష్‌ను ప్రిన్సిపాల్ వర్మ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: మండలంలోని రమణయ్యపేట పంచాయతీ పారిశుధ్య కార్మికులకు గురువారం దుస్తుల పంపిణీ చేశారు. పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజక వర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి దుస్తులు, చెప్పులు, నూనెల, సబ్బులు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత గోపుశెట్టి బాబ్జీ, గంజా సత్తిబాబు, కృష్ణంరాజు, భాష, చక్రధర్, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



సీఐటీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

కాకినాడ సిటీ: సీఐటీయూ కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2023 క్యాలెండర్‌ను సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి గురువారం కాకినాడలోని జిల్లా కార్యాలయంలో ఆవిష్కరించారు. ఒక్కొక్క నెలకు ఒక్కొక్క సామాజిక అంశాన్ని ప్రతిబింబించేలా సీఐటీయూ క్యాలెండర్‌ను రూపొందించామన్నారు. 2023లో కార్మిక, ఉద్యోగ, రైతాంగ సమస్యలపై పోరాటాల సంవత్సరంగా సీఐటీయూ గుర్తించిందన్నారు. దీనికి అనుగుణంగా ఏప్రిల్ ఐదో తేదీన చలో పార్లమెంట్ కార్యక్రమానికి వేలాదిగా ఢిల్లీ చేరుకుని కార్మిక ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రతినిధులు చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, పలివెల వీరబాబు, మేడిశెట్టి వెంకటరమణ, షేక్ పద్మ, నక్కెళ్ల శ్రీను, టి రాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భోగి సందడి

- రంగవల్లుల్లో మహిళలు
- భోగిమంటలకు సన్నాహం
- హరిదాసుల సందడి



గ్రామాల్లో సందడి చేస్తున్న డూడూ బసవన్నలు



సందడి చేస్తున్న హరిదాసు



భోగిమంట వేస్తున్న దృశ్యం(ఫైల్)



సంక్రాంతికి కోడిపందేలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

కరప: మండలంలోని అన్ని గ్రామాల్లో భోగి పండగ సందడి నెలకొంది. హరిదాసు హరినామ సంకీర్తనలతో పల్లెవాసులను మేలుకొలుపుతుంటే, మహిళలు తమ ఇంటి ముంగిట రంగురంగులతో రంగవల్లులతో తీర్చిదిద్దుతున్నారు. సంక్రాంతి సెలవులు కావడంతో యువతీయువకులు ఆటపాటలతో కేరింతలు కొడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. కొన్ని గ్రామాల్లో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆదేశాలతో కరప ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో సంప్రదాయ క్రీడలే ముద్దు, జూద క్రీడలు వద్దు అంటూ పలుగ్రామాల్లో వాలీబాల్, కబడ్డీ ఆటల పోటీలు, మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నారు.

సంక్రాంతి అంటే గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మక్కువ. రైతు కుటుంబాలు ఎక్కువగా ఉండే పల్లెల్లో ఈ నెలలోనే తొలకరి పంట చేతికొస్తుంది. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఈ పండగ కోసమే ఎదురు చూస్తుంటారు. భోగి పండగ రావడంతో చలిని కూడా లెక్క చేయకుండా మహిళలు పోటాపోటీగా ఇంటి వాకిట్లో కల్లాపు చల్లి వివిధ రకాల ముగ్గులతో పాటు నెలవంక ముగ్గులను తీర్చిదిద్దుతారు. సంక్రాంతి పండగ నాలుగు రోజులూ వేడుకగా జరుపుకోవడం సంప్రదాయంగా వస్తోంది. మొదటి రోజు పండగను భోగి అంటారు. ఈ పండగ నాడు తెల్లవారు జామునే యువకులు, పెద్దలు కలిసి వీధివీధినా భోగి మంటలు వేస్తారు. పిల్లలు, యువకులు పొలాల నుంచి దుంగలు, కలప, పిడకలు ఈ పండగ కోసం నెలరోజులుగా సేకరించి ఉంచుతారు.

భోగి రోజు ఉదయాన్నే తలస్నానం చేసి కొత్త దుస్తులు ధరించి భోగి దండలను భోగి మంటలో వేసి భక్తితో నమస్కరించడం పల్లె ప్రజల ఆచారం. రెండో రోజు సంక్రాంతి పండగ. ఈ రోజున ప్రతి ఒక్కరూ తమ పెద్దలను తలచుకుని వారి పేరుతో పేదలకు కొత్త బట్టలు, అటుకులు, పండ్లు సమర్పించి వారి ఆశీర్వాదం తీసుకుంటారు. ఇలా చేస్తే పితృదేవతలు సంతోషిస్తారు. రైతులు తమ పశువులను నీళ్లతో శుభ్రంగా కడిగి పసుపురాసి, కుంకుమ బొట్టు పెట్టి పూజిస్తారు. మూడో రోజు కనుమ పండగ. ఆ రోజున కాకి కూడా నీళ్లలో మునుగుతుందని ఆర్యోక్తి. అందుకే ఈ రోజున ప్రతిఒక్కరూ భక్తితో తలస్నానం చేస్తారు. ఈరోజున కొత్త అల్లుళ్లను గ్రామ పొలిమేర కూడా దాటనీయకుండా చూసుకోవడం మరో ఆనవాయితీ. రైతులు తమ ఇంటివద్ద పశువుల పేడను గుట్టగా చేసి, నైవేద్యం పెట్టి, పూజలు చేస్తారు. నాలుగో రోజు ముక్కనుమ పండగ. ఆరోజున దేవతలకు నైవేద్యాలు సమర్పిస్తారు. అదే రోజున మహిళలు బొమ్మల నోమును ఆచరిస్తారు. యువకులు గాలిపటాలను పోటాపోటీగా ఎగుర వేసి ఉత్సాహంగా గడుపుతారు. సంక్రాంతి పండగకు ముందుగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి అల్లుళ్లను, కుమార్తెలను, బంధువులను, స్నేహితులను పిలిచి విందు భోజనాలు పెడతారు. సంక్రాంతి పండగ రోజుల్లో గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించి సరదాగా గడుపుతారు. ఆఖరి పండగ రోజున మహిళలు రథం ముగ్గు వేసి భోగిమంటలోకి తాడును కలుపుతారు. కొన్ని గ్రామాల్లో ఎండ్లబండి పరుగు పోటీలు, క్రికెట్, కబడ్డీ, ఖోఖో వంటి ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేస్తారు. కొన్ని గ్రామాల్లో బరులు తయారు చేసి కోడిపందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలియవచ్చింది. ఏటా సంవత్సరం కోడిపందేలకు అనుమతిచ్చినట్టుగానే ఈ ఏడాది కూడా ఇస్తారని పందెగాళ్లు ఎదురు చూస్తున్నారు.

అద్దె గదుల ధరలు తగ్గించాలి



అద్దె గదుల రేట్లను తగ్గించాలని కోరుతూ కలెక్టర్ కృతికా శుక్లాకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కాకినాడ సిటీ: తిరుమల తిరుపతి దేవస్థానం అద్దె గదుల రేట్లను ప్రభుత్వం అడ్డుగోలుగా పెంచడంపై రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు పిలుపు మేరకు గురువారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి వినతి పత్రం అందజేశారు. వంద రూపాయలు ఉండే అద్దె గది రూ.1000, రూ.500 ఉండే అద్దె గది రూ.1700, రూ. 1000 ఉండే అద్దె గది రూ.2,200లకు ఇలా కేటగిరీల వారీగా అధిక సంఖ్యలో రేట్లు పెంచడం దారుణమన్నారు. హిందూ దేవాలయాలను ధ్వంసం చేసిన వ్యక్తులపై ఎటువంటి కేసులు పెట్టడం గాని, పట్టుకోవడం కాని చేయడం లేదన్నారు. అద్దె గదుల రేట్ల పెంపు జీవోలు వెంటనే రద్దు చేయాలని కోరారు. లేదంటే రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, వేటుకూరి సూర్యనారాయణరాజు, ఎనిమిరెడ్డి మాలకొండయ్య, మట్ట మంగరాజు, బుర్ర కృష్ణంరాజు, విత్తనాల వెంకటరమణ, గట్టి సత్యనారాయణ, విశ్వనాధపల్లి శ్రీనివాసరాజు, తుమ్మల పద్మజ, పెండెం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఊరు-వాడా సంక్రాంతి సంబరాలు



గీతం స్కూల్ భోగి మంటలు కాగుతున్న విద్యార్థులు, రోటరీ సభ్యులు



రమణయ్యపేట గైగోలుపాడులో రంగవల్లుల పోటీలో విద్యార్థినులు



గంగనాపల్లిలో ఎడ్ల బండిపై ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడరూరల్: స్థానికంగా సంక్రాంతి సంబరాలు సందడి చేస్తున్నాయి. వలసపాకల గ్రామంలో జెడ్పీటీసీ సభ్యుడు నులుకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో కేంద్రియ విద్యాలయం పక్కన ఉన్న ఖాళీ స్థలంలో సంక్రాంతి సంబరాలను గురువారం నిర్వహించారు. పెద్ద ఎత్తున రంగవల్లుల పోటీలు నిర్వహించగా మహిళలు భారీగా హాజరై ముగ్గులు వేసేందుకు పోటీపడ్డారు. హరిదాసుల కీర్తనలు, డూడూ బసవన్నల విన్యాసాలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు బెలూన్‌లను ఎగురవేసి సంక్రాంతి వేడుకలు ప్రారంభించారు. భోగి మంటలు వేసిన అనంతరం రంగవల్లులను పరిశీలించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఉన్నీసా బీబీ, నాయకులు గోపిశెట్టి బాబ్జి, తోటకూర శ్రీనివాస్, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గంగనాపల్లి చేరుకుని జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబుతో కలిసి సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే కన్నబాబు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన గీసాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎడ్లబండిపై ఎస్పీ, ఎమ్మెల్యే కొద్ది దూరం ప్రయాణించి అలరించారు. భోగిమంటలు వేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. నవరత్నాల పథకాలు, రంగవల్లులు, రాజన్న-జగనన్న చిత్రాలతో కూడిన ముగ్గులపోటీ ఆకట్టుకుంది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాలీబాల్, కబడ్డీ, ఖో ఖో, రంగవల్లుల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గీసాల మహాలక్ష్మి, ఉపసర్పంచ్ సుభాష్, ఎంపీటీసీ సభ్యులు సత్యవేణి, గనిలక్ష్మి, డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇంద్రపాలెం గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఎమ్మెల్యే, ఎస్పీ పాల్గొని వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు.

సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాలి

బోట్‌క్లబ్: మన సంస్కృతి సంప్రదాయాలు కాపాడుకోవాలని రోటరీ క్లబ్ కాకినాడ మాజీ అధ్యక్షుడు చోడవరపు మూర్తి, తడాల వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక గీతం స్కూల్లో రోటరీక్లబ్ కాకినాడ, గీతం స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి పోటీలను గురువారం వారు ప్రారంభించారు. స్కూల్ ప్రిన్సిపాల్ శారద ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గులు పోటీలు, బొమ్మల కొలువు, భోగిమంటలు, పొంగల్లు ఏర్పాటు చేశారు. హరిదాసు వేషధారణలో, సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థులు అలరించారు.

ఆకట్టుకున్న ముగ్గులు పోటీలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గైగోలుపాడులో మూర్తి స్కూల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు పాలిక నరసింహమూర్తి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విద్యార్థినులు, మహిళలు పోటాపోటీగా ముగ్గులు పెట్టారు. విజేతలకు నరసింహమూర్తి బహుమతులు అందజేశారు.

పైడాలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

కాకినాడ: స్థానిక పైడా వీఆర్‌టీ డిగ్రీ కళాశాలలో పైడా క్రాంతి పేరుతో సంక్రాంతి సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామీణ సంక్రాంతి వేడుకలను తలపించేలా విద్యార్థులు రంగవల్లులు, గొబ్బెమ్మలు, కోలాటం, డూడూబసవన్న ఊరేగింపు, హరిదాసు కీర్తనలు, ఎడ్లబండ్లపై ఊరేగింపులు తదితర కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.హేమలత హాజరై విద్యార్థులకు చదువతోపాటుగా క్రమశిక్షణ అవసరమన్నారు. కళాశాలలో చక్కని కార్యక్రమాన్ని నిర్వహించిన పైడా సంస్థల చైర్మన్ పైడా సత్యప్రసాద్, కార్యదర్శి శ్రీరామ్‌లను అభినందించారు.

హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడిగా అంకాడి సత్తిబాబు



ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసిన హెచ్‌ఎంఎస్ అధ్యక్ష, కార్యదర్శులు అంకాడి సత్తిబాబు, చింతా శ్రీను

కాకినాడ: హెచ్‌ఎంఎస్ కార్మిక సంఘ అధ్యక్షుడిగా వైఎస్సార్‌సీపీ బలపరిచిన అంకాడి సత్తిబాబు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా చింతా శ్రీనును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అంకాడి సత్తిబాబు, చింతా శ్రీను హెచ్‌ఎంఎస్ సభ్యులు, ఇతర ప్రతినిధులతో కలిసి గురువారం సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించిన కార్మికులకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కంటైనర్ల సమస్య, బోనస్‌ల పంపిణీ వంటి అన్ని అంశాల ద్వారా కార్మికుల జీవన ప్రమాణాలు పెంచి ఆర్థికంగా నిలదొక్కుకునేలా తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్మిక పక్షపాతిగా ఉంటూ ఇటీవలే యాంకరేజ్‌పోర్టు అభివృద్ధికి రూ.90 కోట్లు మంజూరు చేయించారన్నారు. గతంలో పనిచేసిన ప్రభుత్వాలు పోర్టు ద్వారా వచ్చే ఆదాయాన్నే తప్ప కార్మికుల సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. డీప్‌వాటర్ పోర్టు ద్వారా మరిన్ని ఎగుమతులు పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఖాలీద్ బిన్ వలీ



ఎమ్మెల్యే ద్వారంపూడిని కలిసి కృతజ్ఞతలు తెలియజేస్తున్న మైనార్టీసెల్ అధ్యక్షుడు వలీ

కాకినాడ: వైఎస్సార్‌సీపీ నగర మైనార్టీసెల్ అధ్యక్షుడిగా ఖాలీద్ బిన్ వలీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదంతో గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఈ నియామకాన్ని ప్రకటించింది. సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వలీకి నియామక ఉత్తర్వులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు తనతోపాటు కలిసి పనిచేసి వలీ కుమారుడికి పదవి రావడం ఎంతో సంతోషంగా భావిస్తున్నానన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యున్నతి కోసం, మైనార్టీల సంక్షేమం కోసం వలీ కష్టించి పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్, వ్యాపారవేత్త అలీషా, వైఎస్సార్ సీపీ నాయకులు రాగిరెడ్డి సుబ్బారావు, సుంకర విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల హాకీ ఫైనల్స్‌లో కాకినాడ

నాగమల్లితోట జంక్షన్: ఏలూరులో ఈనెల 11 నుంచి జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ సీనియర్ మహిళ అంతర్ జిల్లాల హాకీ పోటీల్లో కాకినాడ జిల్లా జట్టు ప్రతిభను కనబరిచి ఫైనల్స్‌కు చేరుకుంది. గురువారం నిర్వహించిన సెమీ ఫైనల్స్‌లో అనంతపురం పై 4-0 స్కోర్ తేడాతో కాకినాడ జిల్లా జట్టు విజయం సాధించింది. జట్టుకు కోచ్‌లుగా పీడీ వి.రవిరాజు, పి.శేషుకుమారి, మేనేజర్‌గా దుర్గాదేవి వ్యవహరిస్తున్నారు.

లారీ యజమానులు, క్లీనర్ల సంక్షేమానికి కృషి



కార్మికులకు వస్తువులు పంపిణీ చేస్తున్న కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.రాజు

కాకినాడ: మోటారు లారీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న డ్రైవర్లు, యజమానులు, క్లీనర్ల సంక్షేమానికి తన వంతు తోడ్పాటు అందిస్తానని కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ఎస్.రాజు చెప్పారు. గురువారం నూతన సంవత్సరం, సంక్రాంతి సందర్భంగా లారీ యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లకు రూ.ఐదు లక్షల విలువైన వస్తువులు పంపిణీ చేశారు. ప్రముఖ వ్యాపార వేత్త వినోద్ అగర్వాల్ సహకారంతో ఒకొక్కరికి రూ.రెండు వేల నగదు, బియ్యం బస్తా, దుప్పట్లు, దుస్తులు, నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు ఎంవీ ప్రతాప్‌కుమార్, చిక్కాల సుధాకర్, కార్యదర్శి మట్టా రాంబాబు, సంయుక్త కార్యదర్శులు కొవ్వూరి సుధాకర్‌రెడ్డి, వరిపల్లి శివన్నారాయణ, కోశాధికారి పైలా రామచంద్రరావు, కన్వీనర్ సాగి శివరామరాజు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

మోతమీరిన బైకర్లకు వాత



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోడిఫైడ్ సైలెన్సర్లు

కాకినాడ క్రైం: మోడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తున్న బైకర్లకు పోలీసులు తమదైన శైలిలో బుద్ధి చెప్పారు. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి మోతకు వాత పెట్టారు. మోడిఫైడ్ సైలెన్సర్లను తమ వాహనాలకు అనుసంధానం చేసిన 200 మందిని పది రోజులుగా జరుగుతున్న ప్రత్యేక డ్రైవ్‌లో పట్టుకున్నారు. ఆ వివరాలను జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాస్ కాకినాడ టూ టౌన్ ట్రాఫిక్ పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ పాదచారులు, వాహన దారుల భద్రత, శబ్ద కాలుష్య నివారణలో భాగంగా మోడిఫైడ్ సైలెన్సర్లు వినియోగిస్తున్న వాహనాదారులపై చర్యలు తీసుకున్నామన్నారు. 200 వాహనాలు పట్టుకొని సైలెన్సర్లు తొలగించి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న సైలెన్సర్లను ధ్వంసం చేయనున్నామన్నారు. ఇకపై పట్టుబడే వారిని కోర్టుకు అప్పగిస్తామని తెలిపారు. కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ చైతన్య కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ డ్రైవ్ సత్ఫలితాలనిచ్చిందని శ్రీనివాస్ తెలిపారు.

ఆకట్టుకొన్న హరిహర విద్యార్థుల నృత్య ప్రదర్శన

కాకినాడ కల్చరల్: స్థానిక ఎన్‌ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్కళావాహిని భక్తిరస సంగీత సంస్థ ఆడిటోరియంలో సంస్థ 52వ వార్షికోత్సవం, ధనుర్మాస ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి, సంగీత విద్వాంసులు డాక్టర్ ఈవీ కృష్ణమాచార్యులు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. హరిహర ఆర్ట్స్ అకాడమీ నాట్యాచార్యులు పైడారావు శిష్యుల ప్రదర్శించిన నృత్యరూపకాలు ఆకట్టుకొన్నాయి. వీరు నాట్యగణపతి.., దేవదేవం భజే...., స్వాగతం కృష్ణ...,శ్రీనివాసకల్యాణం.., బ్రహ్మాంజలి.. తదితర నృత్యరూపకాలను ప్రదర్శించి ఆకట్టుకొన్నారు. తదుపరి సినీ ఆర్టిస్టు, భగవతార్ కాటంరెడ్డి సత్యనారాయణ శ్రీసత్యనారాయణ వ్రత మహాత్మ్యం హరికథాగానం చేసి భక్తులను అలరించారు. ఈయన శ్రీసత్యనారాయణ స్వామి వ్రతం మహిమలను భక్తులకు వివరించారు. అనంతరం అకాడమీ నాట్యాచార్యులు పైడారావు, అర్చన దంపతులను, భాగవతార్ కాటంరెడ్డి సత్యనారాయణలను సత్కళావాహిని సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరాజు, లక్ష్మీనారాయణ, ఇందిర, రామకృష్ణారావు, కుంజుక లక్ష్మి, శారదాదేవి, తదితరులు పాల్గొన్నారు.

థియేటర్ ఆవరణలో గుండెపోటుతో వ్యక్తి మృతి

కరప: కాకినాడ జిల్లా వేళంగిలోని సినిమాహాలులో గురువారం వీరసింహారెడ్డి సినిమా చూడటానికెళ్లి ఒకవ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన కథనం మేరకు... కరపకు చెందిన చాగంటి బాలశంకరరావు(63) సినిమా చూడటానికి వేళంగిలోని సినిమా హాలులో వీరసింహారెడ్డి సినిమా చూసేందుకు వెళ్లాడు. సినిమా మధ్యలో బయటకు రాగా ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు.గుండెపోటుతో మరణించి ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుని భార్య కొంతకాలంగా దూరంగా ఉంటోంది. అతనికి ముగ్గురు కుమార్తెలు ఉండగా ఇద్దరికి వివాహమైంది, మూడవ కుమార్తె చదువుకుంటోంది.

ప్రతిభ గల క్రీడాకారులకు ప్రోత్సాహం



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం నరసింహమూర్తి

బాలాజీచెరువు: ప్రతిభల గల క్రీడాకారులకు ప్రోత్సాహం ఉంటుందని, అలాగే వారికి మంచి గుర్తింపుతో పాటు ఉన్నత స్థాయికి ఎదగవచ్చని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఆర్.నరసింహమూర్తి పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే క్రీడామైదానంలో నిర్వహిస్తున్న సౌత్‌జోన్ ఇంటర్ వర్సిటీ ఖోఖో మెన్ పోటీలకు సీఎస్‌ఆర్ నిధుల్లో భాగంగా రూ.మూడు లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం నరసింహమూర్తి మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యమిస్తూ ఎదగాలని, ఇష్టమైన క్రీడలో ప్రతిభ చూపితే భవిష్యత్తులో అనేక ఉపయోగాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా ఎస్‌బీఐ ద్వారా విద్యారుణాలు అందజేస్తున్నామని, కేవలం విద్యార్థుల అడ్మిషన్ ఆధారంగా పరిమితికి మించి గ్యారంటీ లేకుండా రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం క్రీడాకారులకు స్పోర్ట్స్ బ్యాగులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ జేఎన్‌టీయూకే బ్రాంచ్ చీఫ్ మేనేజర్ అద్దంకి శివప్రసాద్, స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి జి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

పెన్షనర్ల పీపీఓలు పంపడంలో జాప్యం

కాకినాడ సిటీ: ఏజీ కార్యాలయం నుంచి వచ్చిన పెన్షనర్ల పీపీఓలను సంబంధిత సబ్ ట్రెజరీ కార్యాలయాలకు పంపించడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరుతూ కాకినాడ జిల్లా పెన్షనర్లు తమ సమస్యలను గురువారం జిల్లా ఖజానా అధికారి ఎస్ శ్రీనివాసులును కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సత్తిరాజు మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో కొన్ని సబ్ ట్రెజరీల్లో కొంత మంది సిబ్బంది పెన్షనర్లకు రావల్సిన బకాయిలు చెల్లించే సందర్భంలో అవినీతికి పాల్పడుతున్నట్టు జిల్లా ఖజానాధికారి దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిపారు. పెన్షనర్ల సమస్యలపై స్పందించిన జిల్లా ఖజానాధికారి శ్రీనివాసులు స్పందిస్తూ డిసెంబర్ నెలాఖరు వరకు ఉన్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించామని జనవరి నుంచి ప్రతి సబ్‌ట్రెజరీ పరిధిలో సమస్యలు సకాలంలో పరిష్కరించాలని తగు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎక్కడైనా ఎవరైనా పెన్షనర్లకు రావల్సిన బకాయిలు చెల్లించడంలో జాప్యం జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సత్యనారాయణరాజు, పి మోహన్‌మురళి, తదితరులు ఉన్నారు.

నాటుసారాతో ఇద్దరి అరెస్ట్

కరప: కరప పోలీసులు దాడిచేసి, నాటుసారా కాస్తున్న ఇద్దరి నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 30 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. కరప ఎస్‌ఐ ఎస్.రామకృష్ణ తెలిపిన కథనం ప్రకారం.. పిఠాపురం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అరట్లకట్ట సమీపంలోని కుళాయి చెరువు వద్ద సారా కాస్తున్నట్టు సమాచారం అందడంతో గురువారం రాత్రి ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిందితులను అదుపులోకి తీసుకున్నామని, వారిపై కేసు నమోదుచేసి, కాకినాడ కోర్టులో హాజరుపరుస్తామని కరప ఎస్‌ఐ తెలిపారు.

స్ఫూర్తి ప్రదాత స్వామివివేకానంద

కరప: స్వామి వివేకానంద తన బోధనలతో భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ బొండా సూర్యారావు అన్నారు. స్వామి వివేకానందుని 160వ జయంతి సందర్భంగా గురువారం స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో వివేకానందుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి, మాట్లాడారు. సనాతన ధర్మం , భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచదేశాలకు చాటి చెప్పారన్నారు. యువకులు వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వివేకానందుడి జయంతి రోజున యువజన దినోత్సవంగా జరుపుకొంటున్నామన్నారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, సామాజిక కార్యకర్త చిన్నారి వీరభద్రరావు, గరగ జెమ్మీ, శాకా శ్రీనివాస్ , కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.